AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com

## నందిపేట్ ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడి ఎన్నిక

**అక్షరటుడే, నందిపేట్ :** మండలంలోని ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా వెల్మల్ గ్రామానికి చెందిన జీఆర్ రాజేందర్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని 19 గ్రామాలకు చెందిన 186 మంది వార్డు సభ్యుల సమావేశమై కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా మాణిక్యం శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శిగా సెంట్రింగ్ గంగన్న, కోశాధికారిగా ఎస్‌కే అఫ్రాజ్‌లను సభ్యులు ఘనంగా సన్మానించారు. సభ్యులకు ఎలాంటి సమస్యలున్న పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని అధ్యక్షుడు ఆయన తెలిపారు. నూతన కమిటీ సభ్యులను పలువురు వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఫోరం కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

6-9-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2



## అనాథ పిల్లలను అక్కున చేర్చుకున్న హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్

**అక్షరటుడే,బోధన్:** బోధన్ హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్, రోజ్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆలంబన ప్రాజెక్టు కింద రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన బోధన్‌కు చెందిన 45 మంది అనాథ పిల్లలను చేర్చుకుంది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 200 మంది అనాథ పిల్లలకు ఈ కార్యక్రమం ద్వారా సహాయం అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులైన పిల్లలు, వారి తల్లులు, హైదరాబాద్ మావెరిక్స్ సభ్యులు, వాలంటీర్లు మరియు బోధన్ రోటరీ క్లబ్ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోధన్ మున్సిపల్ ఛైర్ పర్సన్ పద్మావతి మాట్లాడుతూ, తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన పిల్లలకు రోటరీ క్లబ్ అందిస్తున్న చేయూత ఎంతో గొప్పదని ప్రశంసించారు. ఇలాంటి పిల్లలను గుర్తించి, వారి చదువు, పోషణ బాధ్యత తీసుకోవడం సమాజానికి ఆదర్శమని అన్నారు. బోధన్ మున్సిపాలిటీ తరపున ఈ కార్యక్రమానికి తమ పూర్తి మద్దతు, సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా, ఆలంబన లబ్ధిదారిని, ప్రభుత్వ వైద్య కళాశాల నిజామాబాద్‌లో 4వ సంవత్సరం మెడిసిన్ చదువుతున్న విద్యార్థిని జోషిత తన కృతజ్ఞతా ప్రసంగం చేశారు. రెంజల్ సర్పంచ్ లలిత మాట్లాడుతూ, రోటరీ క్లబ్ హైదరాబాద్ మావెరిక్స్ న్న సేవలు అభినందనీయమన్నారు.




# ఇందూరు పసుపు

**తెలంగాణ వ్యవసాయ రంగానికి గ్లోబల్ మార్కెట్‌లో సరికొత్త గుర్తింపు లభించింది. రాష్ట్రంలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఎగుమతి కేంద్రాలుగా ఎంపిక చేస్తూ ప్రభుత్వం అధికారిక నిర్ణయం తీసుకుంది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో ఉత్తర తెలంగాణ ప్రాంత ఉత్పత్తులు ప్రపంచ యవనికపై సరికొత్త రికార్డులను సృష్టించడానికి సిద్ధమవుతున్నాయి. - అక్షరటుడే, ఎల్లారెడ్డి**

- ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఎగుమతి కేంద్రాలుగా నిజామాబాద్, కామారెడ్డి
- పెరగనున్న ఎగుమతులు

ప్రపంచ వ్యాప్తంగా నాణ్యమైన పసుపు పంటకు పేరొందిన నిజామాబాద్ జిల్లాకు ఇకపై "గ్లోబల్ బ్రాండ్" గుర్తింపు లభించనుంది. ఇప్పటికే అంతర్జాతీయంగా నిజామాబాద్ పసుపునకు భారీ డిమాండ్ ఉండగా, ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఈ ఎగుమతులు మరింత పెరగనున్నాయి. కేవలం పసుపు మాత్రమే కాకుండా, జిల్లా నుండి అత్యంత నాణ్యమైన బియ్యం, మేలైన విత్తనాలు మరియు వివిధ చక్కెర ఉత్పత్తులు కూడా ఈ ఎగుమతి జాబితాలో చేరాయి. ప్రభుత్వం కల్పించనున్న ప్రత్యేక మౌలిక సదుపాయాలు, సబ్సిడీల వల్ల నాణ్యతా ప్రమాణాలు పెరిగి, స్థానిక రైతులకు మార్కెట్‌లో గరిష్ట గిట్టుబాటు ధర లభించనుందని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

### ఆయిల్‌పామ్ సాగు

కామారెడ్డి జిల్లాలో ఇటీవల ఆయిల్ పామ్ సాగు పెరిగింది. అది ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్ పరిధిని అందుకోబోతోంది. కామారెడ్డి ఆయిల్ పామ్ ఉత్పత్తులను నేరుగా గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేయడం ద్వారా రైతులకు గరిష్ట లాభాలు చేకూరనున్నాయి. దీంతో పాటు కామారెడ్డి జిల్లా పౌల్ట్రీ రంగానికి కూడా ఈ అంతర్జాతీయ ఎగుమతుల నిర్ణయం భారీ ఊతాన్ని ఇవ్వనుంది. ఇక్కడి నుండి నాణ్యమైన కోడి మాంసం, కోడిగుడ్లు విదేశీ మార్కెట్లకు తరలనున్నాయి. ఈ సరికొత్త ఎగుమతి విధానం వల్ల స్థానిక కోళ్ల పరిశ్రమ రూపురేఖలు మారడమే కాకుండా, వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

## త్రిలింగ రామేశ్వరాలయాన్ని పరిశీలించిన పురావస్తు శాఖ అధికారులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట మండలం తాండూర్ గ్రామ శివారులోని మంజీర నది ఒడ్డున కొలువైన అత్యంత పురాతన, చారిత్రక త్రిలింగ రామేశ్వర దేవాలయాన్ని ఆదివారం పురావస్తు శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి క్షేత్ర స్థాయిలో సందర్శించి, పరిశీలించారు. ఆలయ శిల్పకళా వైభవాన్ని, నిర్మాణ శైలిని ఆయన నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రొఫెసర్ అర్జున్ రావు మాట్లాడుతూ.. 11వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం అద్భుతమైన నిర్మాణ శైలిని కలిగి ఉందన్నారు. ఆలయం తలుపులు పూర్తిగా మూసి ఉంచినప్పటికీ, లోపలి శివలింగంపై నేరుగా సూర్యరశ్మి (సూర్యకిరణాలు) పడేలా రూపకల్పన చేయడం నాటి శిల్పుల మేధస్సుకు, ఈ క్షేత్ర మహిమకు నిదర్శనమని కొనియాడారు. ఒకే చోట రామేశ్వర, భీమేశ్వర, సోమేశ్వర అనే మూడు లింగాల కలయికతో ఈ ఆలయం లింగాకృతిలో ఉండటాన్ని ఆయన పరిశీలించారు. త్రేతా యుగంలో శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతాదేవి సమేతంగా ఇక్కడి శివలింగాలను ప్రతిష్టించారని భక్తుల నమ్మకం.ఈ పురాతన ఆలయాన్ని తొలుత చాళుక్యులు నిర్మించగా, ఆ తర్వాత కాకతీయుల కాలంలో ఇది పూర్తి స్థాయి అభివృద్ధి చెందిందని చరిత్రకారులు చెబుతున్నారు. సిమెంట్, మట్టి వాడకుండా కేవలం కృష్ణశిలలతో (రాళ్లతో) ఈ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారు. మంత్రముగ్ధులను చేసే పచ్చని వరిపొలాలు, గ్రామీణ వాతావరణం మధ్య మంజీరా నదీ తీరాన వెలసిన ఈ ఆలయానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉందని డైరెక్టర్ పేర్కొన్నారు.

## 24 గంటల్లోనే బాలుడి కిడ్నాప్ కేసును ఛేదించాం : సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలో కలకలం సృష్టించిన బాలుడి కిడ్నాప్ కేసును 24 గంటల్లోనే ఛేదించామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలో కిడ్నాప్ వివరాలను విలేకరులకు వివరించారు. శనివారం ఉదయం ఆస్పత్రికి వచ్చిన బాధిత కుటుంబం వద్ద నుంచి బాలుడు వేదాన్ష్‌ను చాక్లెట్ ఆశ చూపి అపహరించారని పేర్కొన్నారు. కిడ్నాపర్లను నిజాంపేట్ గ్రామస్తులు సుజాత, ఎల్లమ్మగా గుర్తించామన్నారు. ఆస్పత్రిని బాలుడిని కేవలం మూడు నిమిషాల్లోనే ఎత్తుకెళ్లారని సీపీ తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా బాలుడిని సంగారెడ్డి జిల్లాలోని దౌలతాబాద్ ప్రాంతానికి తీసుకెళ్లినట్లుగా గుర్తించి వారిని అరెస్ట్ చేశామన్నారు. అనంతరం బాలుడిని స్వాధీన పర్చుకుని ఆదివారం సాయంత్రం తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

**అక్షరటుడే, బాల్కొండ :** విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. ఆదివారం బాల్కొండలోని మైనారిటీ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్‌రూమ్‌లను పరిశీలించి భోజనం నాణ్యతపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న వసతులపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థినికి యూనిఫామ్‌లను సకాలంలో అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయినులు సోనీ, స్టాఫ్ నర్సు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.




### గ్రంథాలయం పరిశీలన..

బాల్కొండ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు పరిశీలించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించిన ఆయన విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో రాణించాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ గంగాధర్, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్, లైబ్రేరియన్ వరలక్ష్మి తదితరులు ఉన్నారు.



## పల్లెల ప్రగతిని కాంగ్రెస్ నిర్వీర్యం చేసింది..

**అక్షరటుడే, కామారెడ్డి:** కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల ప్రగతిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను ఎత్తి చూపుతూ భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రోడ్లపై పేరుకుపోయిన చెత్తను గంప గోవర్ధన్, ముజీబొద్దీన్ లు స్వయంగా శుభ్రం చేస్తూ తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యానికి, అభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. ప్రతి గ్రామంలో ట్రాక్టర్లు, డంప్ యార్డులు, నర్సరీలు ఏర్పాటు చేసి పల్లెలను పరిశుభ్రంగా ఉంచామని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లె ప్రగతిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదని, దీంతో గ్రామాల్లో చెత్త పేరుకుపోయి డ్రైనేజీలు పూడుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కూడా కరువయ్యాయని, దీని వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మేల్కొని గ్రామ పంచాయతీలకు బకాయిలు విడుదల చేసి పారిశుద్ధ్య వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామ గ్రామాన ఇదే తరహాలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

**అక్షరటుడే, కామారెడ్డి:** తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామిని కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఛైర్‌పర్సన్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వేద పండితులు వారికి వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. స్వామివారి కృపా కటాక్షాలతో కామారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. పట్టణాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంపత్ కుమార్, బీసీ సంఘం అధ్యక్షుడు నీల నాగరాజు, పోచమ్మల శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో యువతకే ప్రథమ ప్రాధాన్యం

**అక్షరటుడే, భీమ్‌గల్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లోనే పదేళ్ల నిరుద్యోగాన్ని తరిమికొట్టి, యువత సంక్షేమం కోసం విప్లవాత్మక చర్యలు చేపట్టిందని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం భీమ్‌గల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సహస్ర ఫంక్షన్ హాల్‌లో జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 70 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని, 2024 డీఎస్సీ ద్వారా 11,062 ఉపాధ్యాయ పోస్టులను విజయవంతంగా నింపినట్లు చెప్పారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్ 1, 2, 3 పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా చదువుకున్న వెంటనే ఉద్యోగం వచ్చేలా 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని అందుబాటులోకి తెచ్చినట్లు నాయకులు తెలిపారు. ఐటీఐలను 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు'గా మారుస్తూ, ఐటీ, బ్యాంకింగ్ రంగాలు, పరిశ్రమలకు అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతను ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు 'రాజీవ్ యువ వికాసం' కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు రూ. 3 లక్షల వరకు సబ్సిడీ రుణాలు ఇస్తున్నామని, అందుకోసం 202627 బడ్జెట్‌లో రూ. 5,800 కోట్లు కేటాయించినట్లు వివరించారు. క్రీడల్లో ప్రతిభ చూపించే వారి కోసం 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయడంతో పాటు, ప్రైవేట్ రంగంలో అవకాశాల కోసం క్రమం తప్పకుండా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ కాలనీ హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ భారత్...




**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ శ్రీ భక్తాంజనేయ మందిర ఆవరణలో ఆదివారం ఆర్మూరు మహాత్మా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం ఆవరణలో పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా 70వ ఆదివారం జర్నలిస్ట్ కాలనీలో హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్, గౌరవ అధ్యక్షుడు గడ్డం శంకర్, ఎల్ కుమార్, కొక్కెర భూమన్న, సత్యనారాయణ గౌడ్, సురేష్, సుంకె నిశాంత్, వేద రాజ్ కుమార్, జంగిడి భోజన్న, రాహుల్‌రాజ్, గుర్రం రాకేష్, కుకింగ్ నరేష్, గణేష్, నూకల ఆదిత్య, మహేష్ అగర్వాల్ పాల్గొన్నారు.

## కోతుల బెడద నివారణకు వినూత్నప్రయోగం..



**అక్షరటుడే, బాల్కొండ:** కోతుల బెడద నివారణకు వినూత్న ప్రయోగం చేశారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో గ్రామంలో కోతుల బెడద నివారణకు గ్రామస్తులు యువకుడితో చింపాంజీ వేషం వేయించారు. కోతుల కారణంగా గ్రామంలో చిన్నాపెద్దా ఎన్నో అవస్థలు పడ్డామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇళ్లలోకి చొరబడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండటంతో వాటిని తరిమేందుకు ఈ విధానాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఆదివారం పెద్దసంఖ్యలో కోతులను గ్రామం నుంచి తరిమేసినట్లు చెప్పారు. కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామరాజు గౌడ్, వీడీసీ అధ్యక్షుడు కొండ అశోక్, 10వ వార్డు సభ్యురాలు శ్యామల శ్రీనివాస్, ఎంపల సుదర్శన్, ప్రవీణ్, భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతుల కోసం ప్రత్యేక తీర్మానం



**అక్షరటుడే, కామారెడ్డి:** కాలుష్య నివారణ కోసం ఆ గ్రామం ప్రతి ఏటా మట్టి గణపతులను నెలకొల్పుతోంది. దానికోసం ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తోంది. యువత సైతం దీనికి ముందడుగు వేయడంతో స్థానిక నాయకులు యువతకు అండగా నిలుస్తున్నారు. కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో ఆదివారం యువజన సంఘాల నాయకులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా గ్రామంలో మట్టి గణపతులను ఏర్పాటు చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రతి యువకుడు ఈ విధానాన్ని పాటించాలని సూచించారు. అలాగే గ్రామంలో నెలకొల్పిన వినాయకులకు సీరియల్ నంబర్లు కేటాయించడం జరిగిందని, సమయానుకూలంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయపాలన పాటించాలని తీర్మానించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలన్నారు.



# పల్లెల రూపు రేఖలు మారుతున్నాయ్..

**గ్రామాల రూపురేఖలను మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కొత్త ప్రణాళికకు శ్రీకారం చుట్టాయి. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టం-2025 అమలులో భాగంగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికను అమలు చేయనున్నారు.**

**– అక్షరటుడే, ఎల్లారెడ్డి**

**■ వీబీజీ రామ్‌జీ చట్టం పక్కాగా అమలు ■ ప్రగతికి వికసిత్ ప్రణాళిక.. ■ జియో ట్యాగింగ్‌తో పారదర్శకత**

కామారెడ్డి జిల్లాలో 532 గ్రామపంచాయతీల్లో 1,40,947 జాబ్ కార్డ్స్ ఉన్నాయి. అందులో ప్రస్తుతం 9,348 మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి రోజు 60 మంది కూలీలు పనులులు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అలా ఐతే ప్రతిరోజు 30 వేలమంది కూలీలు పనిచేస్తే వికసిత భారత్ లక్ష్యం నెరవేరేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఇప్పటివరకు పైనుంచి ప్రణాళికలు వచ్చేవి. ఇకపై గ్రామానికి ఏం కావాలో గ్రామసభలోనే నిర్ణయించనున్నారు. ప్రతి గ్రామంలో ఉన్న నిధులు, నీటి వనరులు, వర్షపాతం, భూములు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, రోడ్లు, హరితహారం వంటి పూర్తి వివరాలతో గ్రామ ప్రొఫైల్ తయారు చేసి, వచ్చే ఐదేళ్లకు ప్రణాళిక రూపొందిస్తారు.

### జియో ట్యాగింగ్ తప్పనిసరి..

అంతేకాకుండా.. ప్రతిపనికి జియో ట్యాగింగ్ తప్పనిసరి చేశారు. డిజిటల్ సర్వేతో ప్లానింగ్ చేసి, శాటిలైట్ ద్వారా పనుల పురోగతిని పర్యవేక్షిస్తారు. దీనివల్ల నిధుల దుర్వినియోగం అరికట్టి పారదర్శకత పెరుగుతుంది. ఈ కొత్త చట్టం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించడం లక్ష్యం. ఇందుకోసం మొత్తం 318 రకాల పనులకు అవకాశం కల్పించారు.

### ఎలాంటి పనులు చేపడతారు?

ప్రభుత్వం నాలుగు కీలక విభాగాలపై ఫోకస్ పెట్టింది. చెక్ డ్యాములు, కాలువలు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, చెరువులు, బావుల పునరుద్ధరణకు నిర్ణయించారు. అలాగే వ్యవసాయం, పశుపోషణ, చేపల చెరువులు, కాఫీ తోటలు, పట్టు పరిశ్రమ, నర్సరీలపై దృష్టి పెట్టారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, అంగన్‌వాడీ, పాఠశాల భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, వైకుంఠధామాలు, సోలార్ లైట్ల పనులు చేయనున్నారు.

### ఊరూరా గ్రామసభలు

ప్రణాళికల తయారీకి రెండు విడతలుగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కొత్తచట్టంపై అవగాహన, గ్రామ ప్రగతి నివేదిక, గత ఏడాది పనులపై చర్చించనున్నారు. లబ్ధిదారుల ఎంపిక, అంచనా వ్యయంపై చర్చ జరుపుతారు. గ్రామసభ ఆమోదం తర్వాత మండల స్థాయిలో ముగ్గురు సభ్యుల బృందం పరిశీలించి తుది ప్రణాళికకు ఆమోదం తెలుపుతుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం పనుల కోసం అక్టోబర్, నవంబర్‌లో మళ్లీ గ్రామసభలు నిర్వహిస్తారు. ఈ ప్రణాళిక కేవలం పంచాయతీరాజ్ శాఖది మాత్రమే కాదు. వ్యవసాయం, ఉద్యానవన, మత్స్య, అటవీ, విద్య, వైద్య, గ్రామీణాభివృద్ధి సహా మొత్తం 22 శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి అమలు చేయనున్నారు.

## చేపల కోసం కొంగజపం..

**చేపల కోసం కొంగ జపం చేస్తోంది. పోతంగల్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న చెరువులో ఓర్పు, ఏకాగ్రతతో కొంగ చేపల కోసం నిరీక్షిస్తుండగా 'అక్షరటుడే' క్లిక్ మనిపించింది.**

**– అక్షరటుడే, కోటగిరి**



## క్రీడాదుస్తుల వితరణ..

**అక్షరటుడే, ఆర్మూర్ :** మండలంలోని మామిడిపల్లి ఉన్నత పాఠశాల సీనియర్ క్రీడాకారులు సోహైఫ్, షాహిద్ అన్నదమ్ములు సుమారు రూ.10వేల విలువగల 20 క్రీడాదుస్తులను అందజేశారు. తమ తాత దావూద్ పటేల్ పేరుమీద వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో దొంతుల రవీందర్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాజం రాజేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.




## బాల్కొండలో పోలింగ్ కేంద్రాల పరిశీలన..



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు ఆదివారం పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో బీఎల్‌వోలు చేపడుతున్న ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్లు నిండిన యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేసేందుకు ఫారం6, ఓటరు జాబితాలో అభ్యంతరాలు, తొలగింపునకు ఫారం7, వివరాల సవరణకు ఫారం8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం స్వీకరించాలని బీఎల్ఓలకు సూచించారు. ఒకే నియోజకవర్గంలో నివాస మార్పులకు సంబంధించిన దరఖాస్తులను కూడా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. మరణించిన ఓటర్లు, డబుల్ నమోదైన పేర్లు, వివాహం అనంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల వివరాలను గుర్తించి నిబంధనల మేరకు జాబితా నుంచి తొలగించే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. పేరు, ఇంటి నంబర్, చిరునామా, నియోజకవర్గ మార్పులకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

## ఆర్మూర్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఇస్కాన్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం, నందోత్సవ వేడుకలను ఆర్మూర్ పట్టణంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై శ్రీకృష్ణ భగవానుని ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్, ప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు.



## మాతాశిశు ఆస్పత్రిలో ఉద్రిక్తత.. సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి యత్నం



**అక్షరటుడే,నిజామాబాద్ క్రైం:** నగరంలోని బస్టాండ్ సమీపంలో జీజీహెచ్‌కు అనుబంధంగా ఉన్న మాతా శిశు ఆస్పత్రిలో ఆదివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిపై పలువురు దాడికి యత్నించారు.. వివరాల్లోకి వెళ్తే.. బాల్కొండ మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఇద్దరు పిల్లలతో శనివారం చికిత్స నిమిత్తం మాతాశిశు ఆస్పత్రికి వచ్చారు. అయితే వారిద్దరు పిల్లలు బయట ఆడుకుంటుండగా.. అందులో చిన్న బాలుడిని ఓ మహిళ మాయమాటలు చెప్పి ఎత్తుకెళ్లింది. ఈ ఘటనపై సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం ఉందని ఆరోపిస్తూ నాగాపూర్ గ్రామస్తులు కొందరు ఆదివారం మాతాశిశు ఆస్పత్రికి వచ్చారు. అక్కడి సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దాడికి యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వారిని సముదాయించారు. నగరం నడిబొడ్డున జీజీహెచ్ అనుబంధ మాతాశిశు ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్ జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఉదంతాన్ని సీరియస్‌గా తీసుకున్న సీపీ సాయిచైతన్య ప్రత్యేకంగా 8 బృందాలను నియమించారు.

## 7న దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు శిబిరం



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల విద్యా వనరుల కేంద్రం ప్రాంగణంలో సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం, అలిమ్కో సంయుక్తంగా దివ్యాంగులైన విద్యార్థులకు సహాయ పరికరాల అందజేతకు గుర్తింపు శిబిరాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రవీందర్ ఆదివారం తెలిపారు. 18ఏళ్ల లోపు వయసు కలిగి సెరిబ్రల్ పాల్సి, వినికిడి లోపం, ఆర్థో, దృష్టి లోపం తదితర సమస్యలతో బాధ పడుతున్న వారు శిబిరానికి హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ మూడేళ్లుగా ఎలాంటి పరికరాలు తీసుకోని వారు మాత్రమే అర్హులని తెలిపారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు విధిగా ఆధార్ కార్డ్, సదరం సర్టిఫికెట్, యూడీ ఐడీ కార్డ్, ఇన్కమ్ సర్టిఫికెట్, వైట్ రేషన్ కార్డ్ జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని హాజరు కావాలన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యానం 4 గంటల వరకు నిర్వహించే ఈ అలిమ్కో అధికారులు పరీక్షలు నిర్వహించి ఉపకరణాలకు అర్హులను ఎంపిక చేస్తారన్నారు. గుర్తించిన వారికి త్వరలో తేదీని ప్రకటించి ఉచితంగా పరికరాలను అందజేస్తారని వివరించారు.

## రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోంది



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సీహెచ్ రాంభూపాల్ పేర్కొన్నారు. జిల్లాస్థాయి అండర్-15 బాలబాలికల చెస్ టోర్నీ ముగింపు కార్యక్రమం అభ్యాస స్కూల్‌లో నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి విశేష కృషి చేస్తోందని.. క్రీడాకారులు ఈ అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు. విశిష్ట అతిథిగా సిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహిన్ యూనస్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అబ్బాపూర్ రవీందర్, జిల్లా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేశ్, మధుకర్, ఆర్బిటర్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు. బాలురలో విజేతలు.. బి.అభిజిత్ (అభ్యాస ద స్కూల్ నిజామాబాద్), గౌరంగా అశోక్ (ఆచార్య విద్యాలయం బోధన్). బాలికల్లో విజేతలు.. సహస్ర (ఎస్ఆర్ ప్రైమ్), నాగ జ్యోస్నిక (ప్రెసిడెన్సీ నిజామాబాద్) ఉన్నారు.